బాధ్యతగా ఓటేద్దాం..

- యువతా మేలుకో.. ఓటు నమోదు చేసుకో...
- నేడు జాతీయ ఓటరు దినోత్సవం

ప్రజలకు రాజ్యాంగం ఇచ్చిన ఆయుధం ఓటు.. ఐదేళ్లకోసారి దేశ భవిష్యత్తును నిర్ణయించేదీ ఈ ఓటే.. ఈ క్రమంలో 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదైతే ప్రజాప్రతినిధులను ఎన్నుకునే అవకాశం కలుగుతుంది. నేడు జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఓటు నమోదు, ఆవశ్యకతపై ప్రత్యేక కథనం..

మేడ్చల్ రూరల్: జనవరి 25న కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాటైన రోజు. భారత ఎన్నికల సంఘం 1950లోనే ఏర్పడినప్పటికీ 2011 నుంచి జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవంగా అధికారికంగా నిర్వహిస్తున్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో సుమారు 6 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. అయితే, ఎన్నికలప్పుడు ఓటరు కార్డు ఉందో లేదో చూసుకోకపోవడం.. నూతనంగా ఓటు నమోదు చేసుకోకపోవడంతో ప్రతిసారి చాలా మందికి ఇబ్బందులు తప్పడం లేదు. ఏటా జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హత లభిస్తుంది. కానీ, చాలా మంది యువత నమోదు విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. నేడు (గురువారం) జాతీయ ఓటరు దినోత్సవం కావడంతో ప్రతి గ్రామంలోని బూత్ స్థాయి కార్యాలయాల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించనున్నారు.



పూడూర్‌లో బూత్ కేంద్రం వద్ద ఓటు నమోదు చేసుకునేందుకు దరఖాస్తుపత్రాలు నింపుతున్న యువత(ఫైల్)



మేడ్చల్‌లో ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ తీస్తున్న విద్యార్థులు(ఫైల్)

నమోదు ప్రక్రియ ఇలా..

01 జనవరి 2024 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ నూతనంగా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. బూత్ లెవల్ అధికారులు లేదా తహసీల్దార్ కార్యాలయం లేదా మీ సేవ కేంద్రాలలో ఓటరు నమోదుకు ఫామ్–6 అందుబాటులో ఉంటుంది. ఒక ఫొటోతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్ లేదా ఏదైనా పుట్టిన తేదీ ధృవపత్రంతో నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చు. అయితే, ఇప్పటికే ఓటరుకార్డులు ఉన్నవారు పేరు, అడ్రసు తదితర మార్పులు చేర్పుల కోసం ఫామ్–7, ఫామ్–8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా ceotelangana.nic.in వెబ్‌సైట్‌లో నేరుగా దరఖాస్తు చేసుకొని.. ప్రింట్ తీసుకొని తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలి. అనంతరం అధికారులు విచారణ చేసి ఓటరు కార్డు మంజూరు చేస్తారు. ఆపై ఓటరుకార్డు నేరుగా లేదా మీసేవ ద్వారా పొందవచ్చు.

ఎన్నికల ఏడాది కావడంతో..

ఇటీవల రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు జరగగా, త్వరలో పార్లమెంట్ ఆ తర్వాత పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు వరుసగా జరగనున్నాయి. ఈక్రమంలో ఓటరు నమోదుకు కొంతమేర స్పందన లభిస్తోందని అధికారులు చెబుతున్నారు. అయితే, ఓటు విలువపై అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

యువత ఓటు నమోదు చేసుకోవాలి



ఓటరు నమోదు ప్రతి ఒక్కరి బాధ్యత. 18 ఏళ్లు దాటిన యువత ఎప్పుడైనా ఓటు నమోదు చేసుకోవచ్చు. గ్రామాల్లో అందుబాటులో ఉండే బూత్ స్థాయి సిబ్బంది ద్వారా నమోదు చేసుకోవచ్చు. లేదంటే వెబ్‌సైట్ నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు.

– శైలజ, తహసీల్దార్, మేడ్చల్

దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తా



అశోక్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: కాలనీలో ఉన్న సామాజిక భవనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ అశోక్‌నగర్‌లో రూ.18 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను బుధవారం స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దశలవారీగా అశోక్‌నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. విద్యా, వైద్య విషయంలో ఏ అవసరం వచ్చినా తనను నేరుగా కలవాలన్నారు. అశోక్‌నగర్, నెహ్రూనగర్ కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటా..



వయోవృద్ధుల సెక్షన్‌లో క్యారమ్స్ ఆడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్: వయోవృద్ధులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. చిలుకానగర్ డివిజన్ పరిధిలో ఈస్ట్ కళ్యాణపురి వార్డు కార్యాలయంలో బుధవారం వయోవృద్ధులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక గదిని ఆయన స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన గెలుపులో వయోవృద్ధుల పాత్ర ఎంతగానో ఉందన్నారు. ఎలాంటి కష్టం వచ్చినా ఆదుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు డా.చెన్నయ్య, రాజశేఖర్, శ్యాంప్రసాద్, సతీష్, రత్నకుమార్‌రెడ్డి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ చేతన

హబ్సిగూడ: జలమండలి జనరల్ మేనేజర్ సంతోష్, డీజీఎం రజనీకాంత్‌ను బుధవారం హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేని చేతనహరీష్ కలిసి డివిజన్ పరిధిలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రామ్‌రెడ్డినగర్‌లో పెండింగ్‌లో ఉన్న ట్రంక్‌లైన్ పనులు, వాసవీనగర్‌లో రాక్ కటింగ్ పనులు, శ్రీనివాసపురం జంక్షన్ యూజీడీ లైన్, వీధి నంబర్–2 రీమోడలింగ్ యూజీడీ లైన్, రవీంద్రనగర్‌లో నూతన లైన్‌ను పూర్తి చేయాలని ఆమె కోరారు. పెండింగ్ పనులను త్వరలో పూర్తి చేస్తామని జలమండలి అధికారులు హామీ ఇచ్చారన్నారు.

ఉప్పల్ బిల్డర్స్ డైరీ ఆవిష్కరణ



ఉప్పల్ బిల్డర్స్ డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడిపల్లి: ఉప్పల్ బిల్డర్ అసోసియేషన్ డైరీని ఎమ్మెల్యే మల్లారెడ్డి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, ఉప్పల్ బిల్డర్ అసోసియేషన్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ ఆకుల సత్యనారాయణ, కోశాధికారి చేగూరి మురళి, చైర్మన్ సింగనబోయిన రమేష్, ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి, బిల్డర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలని వినతి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తూ..

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని రోడ్డు పనులను మంజూరు చేయాలని కోరుతూ బీజేపీ మల్కాజిగిరి సర్కిల్ నాయకులు చంద్రశేఖర్‌యాదవ్ బుధవారం జోనల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పలు కాలనీల్లో డ్రైనేజీ పనులు జరిగి సంవత్సరం అవుతున్నా తిరిగి రోడ్డు పనులు మొదలు కాలేదని, కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో విగ్నేశ్వర కాలనీ అధ్యక్షులు వెంకటేష్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ దళిత విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా మోహన్

మల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ దళిత విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా నాచారం ప్రాంతానికి చెందిన హెచ్‌ఆర్. మోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం దళిత విభాగం రాష్ట్ర చైర్మన్ ప్రీతం నాగరిగారి నియామకపు ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఆర్. మోహన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో దళిత విభాగం కన్వీనర్‌గా నియమించినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పత్తి కుమార్, ఎల్బీనగర్ అధ్యక్షుడు ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



నియామకపు ఉత్తర్వులను అందుకుంటున్న హెచ్‌ఆర్.మోహన్

ఆర్థిక సాయం



కృష్ణతేజకు ఆర్థిక సాయం అందిస్తున్న డాక్టర్ రామ్

కాప్రా: వ్యాపార సంస్థను ప్రారంభించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న దివ్యాంగుడైన కృష్ణతేజను అనురాగ్ మానసిక వికలాంగుల స్కూల్ డైరెక్టర్ డాక్టర్ రామ్ అభినందించారు. ఇతరులపై ఆధారపడకుండా తన కాళ్లపై తాను నిలబడాలని వ్యాపారాన్ని ప్రారంభించిన కృష్ణతేజకు ఆయన రూ.10 వేల ఆర్థిక సాయం అందించి దాతృత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణతేజను అభినందించారు.

చాదర్ సమర్పించిన ఎమ్మెల్యే

మల్లాపూర్: నాచారం హజ్రత్ చాంద్ పాషా షాహిద్ రహమతుల్లా అలయ్ దర్గా ఉర్సు ఉత్సవాలను దర్గా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మహమూద్ గౌస్, కుద్దూస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై చాదర్ సమర్పించారు. ఉత్సవాలకు మల్కాజిగిరి ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకులు బద్రుద్దీన్, చోటుబాయ్, యూసఫ్, ఖాదిరి, మహ్మద్ ఆరిఫుద్దీన్, యాసీన్, ఖాదిరి, అబ్దుల్ వహీద్, రహమతుల, మహ్మద్‌నూర్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



అల్వాల్‌లో కాంగ్రెస్ బూత్ కమిటీ సమావేశంలో నేతలు

అల్వాల్: ఏఐసీసీ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశానుసారం బుధవారం అల్వాల్‌లోని పంజాబ్ కమ్యూనిటీ హాలులో 133, 134, 135 డివిజన్ల కాంగ్రెస్ బూత్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాజ్‌జితేందర్‌నాథ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి, రాజసింహారెడ్డి, నాగేశ్వర్‌రావు, సూర్యకిరణ్, కొండల్‌రెడ్డి, మల్లికార్జున్, బల్వంత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, ఉదయ్, వెంకటేష్‌గౌడ్, కృష్ణ, బాబు, గౌస్, ఇషాక్, భాస్కర్, విష్ణు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు

మల్కాజిగిరి: మల్కాజిగిరి ఆనంద్‌బాగ్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీని బుధవారం ఎండోమెంట్ పర్యవేక్షణాధికారి మధుబాబు సమక్షంలో లెక్కించారు. రూ.4,36,905 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఏబీ.రవీంద్రరెడ్డి, ప్రధాన అర్చకులు ముదుంబై రమణాచార్యులు, తులసి వెంకటరమణాచార్యులు, క్లర్క్ సంద్ర సుధాకర్, మల్కాజిగిరి మండల ఆర్ఐ శ్రీశైలం, ఆలయ మాజీ చైర్మన్లు ఉమేష్‌సింగ్, రామదాసు, సంతోష్ ముదిరాజ్, మాజీ ధర్మకర్తలు రవీందర్, గణేష్, మానీక్షి, రత్నమాణిక్యం, సూర్యకుమారి, రాధమ్మ, మాధవి, వెంకటరత్నం, హేమలత, సుబ్బలక్ష్మీ, అనిత, వీణామాధురి, పావని, పద్మజ, హేమలత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మరోసారి మల్కాజిగిరి గడ్డపై కాంగ్రెస్ జెండా



మాట్లాడుతున్న మందముల పరమేశ్వర్‌రెడ్డి

కుషాయిగూడ: మరోసారి మల్కాజిగిరి పార్లమెంట్ గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేసి చరిత్ర సృష్టించాలని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జరిగిన చర్లపల్లి డివిజన్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో తిరిగి కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పాటుపడాలన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ఉప్పల్ నియోజకవర్గానికి ముఖ్యమంత్రి కేటాయించిన రూ.10 కోట్ల నిధులకు సంబంధించి డివిజన్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం యాదగిరి, సీతారాంరెడ్డి, విఠల్, పోచయ్య, వెంకట్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌గౌడ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో నీటి సమస్యలకు పరిష్కారం



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: త్వరలోనే మంగాపురం కాలనీవాసులకు నీటి సమస్యలు తీరనున్నాయని మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. మంగాపురం కాలనీలో కొనసాగుతున్న తాగు నీటి పైప్‌లైన్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. తరచూ కాలనీలో నీటి సమస్యలతో ఇబ్బందులు పడుతుండటంతో నూతనంగా పైప్‌లైన్ పనులను చేపట్టినట్లు తెలిపారు. పనులను సకాలంలో పూర్తిచేసి కాలనీవాసులకు తాగునీరు అందేలా చూడాలన్నారు. డివిజన్ వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట స్థానిక నేతలు శేఖర్‌గౌడ్, నిస్సార్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

ఘనంగా డ్రైవర్స్ వేడుకలు



కుషాయిగూడ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో..

కాప్రా: డ్రైవర్స్ డే సందర్భంగా బుధవారం కుషాయిగూడ బస్ డిపో ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. డ్రైవర్లకు ఆర్టీసీ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈసీఐఎల్ బస్ టెర్మినల్‌లో సేఫ్ డ్రైవింగ్‌పై సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా కుషాయిగూడ బస్ డిపో మేనేజర్ చంద్రకాంత్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తూ ఆర్టీసీ అభివృద్ధిలో డ్రైవర్లు ఎంతో ముఖ్యపాత్ర పోసిస్తున్నారని కొనియాడారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మల్కాజిగిరి ఎస్ఐ రమేష్ చేతులమీదుగా ఉత్తమ డ్రైవర్లను సన్మానించి అభినందించారు. ఆర్టీసీ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



నాయకులు గుర్రాల వెంకటేశ్ యాదవ్, గణేష్‌నగర్ కాలనీ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు 24వ డివిజన్ కార్పొరేటర్ గుర్రాల రమా వెంకటేశ్‌యాదవ్ అన్నారు. గణేష్‌నగర్ కాలనీలో రూ.13.50 లక్షలతో సీసీ రోడ్డు పనులకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దశలవారీగా డివిజన్ పరిధిలో మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, పారిశుద్ధ్యం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్



గౌతంనగర్: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు పార్టీ అధిష్టానం అండగా ఉంటుందని కార్పొరేటర్ మేకల సునీతరామయాదవ్ అన్నారు. ఇటీవల మృతిచెందిన బీఆర్‌ఎస్ నేత మేకల నవీన్‌యాదవ్ దశదినకర్మకు ఆమె హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక టీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

‘ఈఎస్ఐ’ సమస్యలను సీఎంకు వివరిస్తా



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ.కోదండరామ్

మల్లాపూర్: ఈఎస్ఐపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను నిలిపివేయాలని తెలంగాణ జేఏసీ పూర్వ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలోని కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ ఈఎస్ఐ జేఏసీ చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం ఈఎస్ఐ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ కోదండరామ్ హాజరై మాట్లాడారు. ఒక డాక్టర్‌నే ఈఎస్ఐ డైరెక్టర్‌గా నియమించాలని కోరడంతో స్పందించిన ఆయన సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు సమయానికి జీతాల చెల్లింపు, రెగ్యులరైజేషన్ వంటి సమస్యలను సీఎంకు వివరిస్తానని హామీ ఇచ్చారు. ఈఎస్ఐ జేఏసీ కన్వీనర్ వేణు శ్రీనయ్య, మోహతాడి, వైద్యులు వెంకటేష్ బాబు, నాగేందర్, వెంకట్‌రెడ్డి, రమేష్, నాగేష్‌చారి, శ్రీకృష్ణ, ధన్‌రాం, విక్టోరియా, ఈఎస్ఐ ఉద్యోగులు పాల్గొన్నారు.

కరెంటు ఉండని ప్రాంతాలు

కుషాయిగూడ: ఏఎస్‌రావునగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం పలు ఫీడర్ల పరిధిలో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు బుధవారం సైనిక్‌పురి ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీరాంనగర్, అణుపురం, ఎల్‌ఐజీ, రాధిక–మౌలాలి రోడ్డు, ఎంఐజీ మెయిన్ రోడ్డు, జీహెచ్‌ఎంసీ కార్యాలయం, మహేష్ నగర్ పార్కు, ఈసీఐఎల్ ఎక్స్‌రోడ్డు, కమలానగర్ పార్కు, అయ్యప్పస్వామి టెంపుల్, గాయత్రినగర్ రోడ్డు నంబర్లు–5, 6, 7, 8, 9, ఎంజీకాలనీ రోడ్డు నంబర్లు 1–6, గాంధీనగర్, ఈస్ట్‌ప్రగతినగర్, చందన్‌బాగ్, బోడేబండ, అంబనగర్ ప్రాంతాల్లో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు కరెంటు ఉండదన్నారు.

పలు ఫీడర్ల పరిధిలో..

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం సూర్యహిల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. నార్త్ బాలాజీహిల్స్, రాజశేఖర్ కాలనీ, సూర్యహిల్స్, న్యూహేమానగర్, మేక్‌డల్ కాలనీ, న్యూ రాంనగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రాజీవ్‌నగర్, అంబేడ్కర్‌నగర్, దేవేందర్‌నగర్, గౌతమినగర్, వీరారెడ్డినగర్, అన్నపూర్ణ కాలనీ, ఇందిరానగర్, పద్మావతి కాలనీ, కమలానగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉదయనగర్ ఫీడర్ పరిధిలో..

ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అంబేద్కర్ విగ్రహం వద్ద, బృందావన్ కాలనీ, బొమ్మక్ బ్రదర్స్ కాలనీ, శ్రీనివాస్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ మైలారం స్వామి వెల్లడించారు. అలాగే మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు టెలిఫోన్ కాలనీ, సాయి భవానీనగర్, ఆనంద్‌నగర్, బాలచిత్తారినగర్, వివేకానందనగర్, భీంరెడ్డి కాలనీ, గ్రీన్‌సిటీ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

విద్యుత్ మరమ్మతుల కారణంగా..

ఉప్పల్: ఐఎస్ఐ ఫీడర్ 33/11 కేవీ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10.30 నుంచి 12.30 వరకు వివేకానందనగర్, జీఎస్ఎన్ కాలనీ, జీజీ కాలనీ, రవీంద్రానగర్ కాలనీ రోడ్ నంబర్–6 నుంచి 27 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రామిరెడ్డి తెలిపారు. స్నేహపురి కాలనీ 11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్నేహపురి కాలనీ, వీఎస్‌టీ, శ్రీనగర్ కాలనీ, భవాని నగర్ వీధి నంబర్–3 నుంచి 5 వరకు, నాచారం మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అన్నారు.

మేడిపల్లిలో..

పీఅండ్‌టీ కాలనీ 11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం మధ్యాహ్నం 1 గంట నుంచి 4 గంటల వరకు పీ అండ్ టీ కాలనీ, బుద్ధానగర్, మల్లికార్జుననగర్, కమలానగర్, విశ్వం విహార్ కాలనీ, అయోధ్య కాలనీ, భరత్‌పురి కాలనీ, భగత్ సింగ్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ హరినాథ్ తెలిపారు.

బెల్ సబ్‌స్టేషన్ పరిధిలో..

మల్లాపూర్: 33/11 కేవీ బెల్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ఫీడర్‌లో గురువారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ తెలిపారు. నోమా ఫీడర్, మల్లాపూర్ విలేజ్, భవానీనగర్ బెల్ ఫీడర్, స్టాండర్ టైల్స్, ఐడీఏ మల్లాపూర్, సాయినగర్, అన్నపూర్ణ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

పీర్జాదిగూడ మున్సిపల్ ప్రాంతంలో..

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపాల్ ప్రాంతంలో మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని అసిస్టెంట్ ఇంజనీర్ ప్రదీప్ కుమార్ అన్నారు. వినాయకనగర్, ఓం విహార్ కాలనీ, మారుతి నగర్, వివేకానంద నగర్, క్రాంతి కాలనీ, శ్రీసాయినగర్ కాలనీ, ప్రశాంతి నగర్, విహారిక కాలనీ, పంచవటి కాలనీ రోడ్‌నంబర్–1, 2, 3, కాకతీయనగర్, ధరణికాలనీ, డీమార్ట్ నుంచి సంపూర్ణ హోటల్, కమలనగర్, శ్రీనివాసనగర్, ఎస్‌వీ కాలనీ, సూర్యోదయ కాలనీల్లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

టెర్మినల్ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి



చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను సందర్శిస్తున్న సీపీఐ ఉప్పల్ సమితి బృందం

కుషాయిగూడ: చర్లపల్లి రైల్వే టెర్మినల్ నిర్మాణం పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీఎస్. బోస్ అన్నారు. సీపీఐ ఉప్పల్ నియోజకవర్గం సమితి బృందం సభ్యులు బుధవారం చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా టెర్మినల్ నిర్మాణ పనులను పరిశీలించిన వారు పూర్తిస్థాయి నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం బోస్ మాట్లాడుతూ ఎంఎంటీఎస్ పనులు పూర్తయినా సేవలు అందుబాటులోకి రావడం లేదన్నారు. రైల్వే అధికారులు స్పందించి ఎంఎంటీఎస్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి చర్లపల్లి నుంచి యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ సేవలను ప్రారంభించాలని కోరారు. సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.శంకర్‌రావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్, నేతలు నర్సింహ, బానుకుమార్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



ఎమ్మెల్యే, కార్పొరేటర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏఈ కీర్తి

కుషాయిగూడ: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇంజినీరింగ్ ఏఈ కీర్తి, కుషాయిగూడ హెచ్‌ఎం బాపురెడ్డి బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం చర్లపల్లి ఏఈగా విధులు నిర్వర్తిస్తున్న ఏఈ స్వరూప మెటర్నిటీ లీవ్‌లో వెళ్లగా ఏఎస్‌రావు నగర్ ఏఈ కీర్తికి అదనపు బాధ్యతలు అప్పగించారు. అధికారులు విధుల్లో అంకిత భావంతో పని చేసి గుర్తింపు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. స్థానిక నేతలు నాగిళ్ల బాల్‌రెడ్డి, నేమూరి మహేష్‌గౌడ్, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376 9912220571
9912225470 9505507657